# కల్తీ కల్లే కారణం..?

## పీరంపల్లిని పీడిస్తున్న కల్తీ కల్లు భూతం..

- కల్లు తాగినప్పటి నుంచే అస్వస్థతకు గురైన గ్రామస్తులు
- ఒకరు మృతి చెందగా... నలుగురికి కిడ్నీలు ఫెయిల్..
- పలు దవాఖానల్లో చికిత్స పొందుతున్న 50 నుండి 60 మంది బాధితులు
- కలుషిత నీరు కారణం కాదని తేల్చిన ఎంపీడీవో, వైద్యులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

**ఇంకా స్పష్టతనివ్వని ఆబ్కారీ శాఖ**



మెడికల్ క్యాంపులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వికారాబాద్, ఆగస్టు 26 : మండలంలోని పీరంపల్లి గ్రామంలో కల్తీ కల్లు ప్రభావంతో చాలామంది అస్వస్థతకు గురై దవాఖాన ల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం రాఖీ పండుగ రోజున కల్లు తాగిన వారికి వాంతులు, విరేచనాలయ్యాయి. ఎంకమ్మగారి దుర్గయ్య(60) ఆ రోజు కల్లు తాగినప్పటి నుంచి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడి నుంచి పట్టణంలోని మిషన్ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా దుర్గ య్య మృతి చెందాడు. కల్లు తాగిన వారు దాదాపుగా 50 నుంచి 60 మంది వరకు కల్లు తాగి అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలు కావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. విష యం తెలుసుకున్న వైద్యారోగ్యశాఖ అధికారులు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి అస్వస్థతకు గురైన వారికి చికిత్స అందిస్తున్నది.

పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న వారిని ఇతర దవాఖానలకు రిఫర్ చేస్తున్నారు. ఇతర ఆస్పత్రులకెళ్లిన వారిలో నలుగురికి కిడ్నీలు ఫెయిలైనట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చి పీరంపల్లిలో కల్లు తాగిన వారు సైతం అస్వస్థతకు గురవుతున్నా రు. గ్రామాన్ని ఎంపీడీవో, వైద్యులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించి స్థానికులు అస్వస్థత చెందేందుకు కలుషిత నీరు కార ణం కాదని తేల్చి చెప్పారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం కల్లు శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించామని, వచ్చిన రిపోర్టుతో కారణం తెలుస్తుంద న్నారు. గ్రామస్తులు అస్వస్థతకు గురికావడా నికి కల్తీ కల్లే కారణమని ముక్తకంఠంగా చెబుతున్నారు.

### కల్లు తాగినప్పటి నుంచే..

నాకు కల్లు తాగే అలవాటు ఉన్నది. సోమవారం గ్రామంలో కల్లు తాగా. ఏదో వింతగా అనిపించింది. మరుసటి రోజు చాలా డల్‌గా అనిపించడంతో వికారాబాద్ లోని మిషన్ దవాఖానకెళ్లి చూపించుకుంటున్నా. నాతోపాటు మా ఊరిలో చాలా మందికి ఆరోగ్యం బాగాలేదు. అందుకు కల్తీ కల్లే అని అనుమానంగా ఉన్నది.



–రాంరెడ్డి, పీరంపల్లి

### ఆరోగ్యం బాగాలేదు..

కల్లు తాగినప్పటి నుంచే ఆరోగ్యం బాగాలేదు. చిన్న జ్వరమే అని ఇంటి వద్దనే ఉన్నా. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణించి వాంతులు, వీరేచనాలయ్యాయి. వెంటనే భయపడి వికారాబాద్‌లోని మిషన్ దవాఖానకు వచ్చా. పరీక్షించిన వైద్యులు గ్లూకోస్ పెట్టి చికిత్స చేస్తున్నారు. గ్రామంలో చాలా మంది అస్వస్థతకు గురయ్యారు.



–లక్ష్మి, బాధితురాలు, పీరంపల్లి

### వాంతులు, విరేచనాలయ్యాయి..

నా భర్త దుర్గయ్య ఆరోగ్యంగా ఉండేవాడు. సోమవారం కల్లు తాగిన తర్వాత నుంచే అనారోగ్యానికి గురై వాంతులు, విరేచనాలయ్యాయి. భయపడి వికారాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని వేరే ఆస్పత్రికి తీసుకెళ్లమన్నారు. మిషన్ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతికి గల రిపోర్టులు ఇంకా రాలేదు



–మృతుడి భార్య అమృతమ్మ, పీరంపల్లి,

# చల్లంగ చూడు పోచమ్మ తల్లీ..

## మండలంలో వైభవంగా బోనాలు



బోనాల ఊరేగింపులో ఆకట్టుకుంటున్న కళాకారుల ప్రదర్శన

కడ్తాల్, ఆగస్టు 26 : అమ్మా పోచమ్మ తల్లి.. మమ్మల్ని కరుణించి..సల్లంగా సూడు తల్లి అంటూ.. గ్రామ దేవతైన పోచమ్మను మండల ప్రజలు వేడుకున్నారు. సోమ వారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బోనాల పండుగను వైభవంగా జరుపుకొన్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో మండలంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రజలు ఇల్లూవాకిళ్లను శుభ్రం చేసుకుని, పోచమ్మతల్లికి మహిళలు బోనాలను ప్రత్యేకంగా అలంకరించి.. సాయంత్రం ఊరేగింపుగా వెళ్లి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల, ఫలహార బండి ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీలు, యువజన సంఘాల నాయకులు, మహిళలు, యువత పాల్గొన్నారు.



ఫలహార బండి ఊరేగింపులో యువతుల నృత్య ప్రదర్శన

# కాలుష్యం కాటుకు చేపలు బలి

- ప్రయాగ్ పరిశ్రమ నుంచి వెలువడిన కలుషిత జలాలు
- చటాన్‌పల్లి సూర సముద్రం చెరువులో చేపలు మృతి
- పరిశ్రమ ఎదుట మత్స్య కారుల ధర్నా, ఆందోళ న



సూర సముద్రం చెరువులో మృతిచెందిన చేపలు



ప్రయాగ్ పరిశ్రమ ఎదుట మత్స్య కారుల ఆందోళన

షాద్‌నగర్, ఆగస్టు 26 : కాలుష్యం కాటుకు చేపలు బలయ్యాయి. మత్స్య సంపద చేతికొచ్చే సమయంలో మృత్యువాత పడడంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేండ్లుగా పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్య జలాలతో చెరువులు కలుషితమవుతున్నాయని గ్రామాల ప్రజలు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నా యాజమాన్యాలు పట్టించుకోవడంలేదు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలోని సూర సముద్రం అనే చెరువులో కొన్నాళ్లుగా మత్స్యకారులు చేపలను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారు. కాగా సోమవారం ఉదయం మత్స్యకారులు చెరువు వద్దకు రాగా.. అందులో మృతి చెందిన చేపలు వారికి కనిపించారు. వాటిని పైకి తీసి చూడగా చెరువు సమీపంలో ఉన్న ప్రయాగ్ కన్స్యూమర్ లిమిటెడ్ అనే చాక్లెట్ పరిశ్రమ నుంచి వచ్చిన కలుషిత జలాలతోనే మృతి చెందాయని గుర్తించి.. ఆ కంపెనీ ఎదు ట చటాన్‌పల్లి మృత్స్యకారులు, ముదిరాజ్ సంఘం నాయకులు ధర్నా చేపట్టి, ఆందోళన చేపట్టారు. మోతాదుకు మించి కలుషిత జలాలు చెరువులో కలవడంతోనే వేల సంఖ్యలో చేపలు మృతి చెందాయని, మిగతా చేపలూ మృతి చెందే ప్రమాదముందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను చెరువులోకి వదిలిన ప్రయాగ్ పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పరిశ్రమ నిర్వాహకులు బాధితులకు నష్ట పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

## అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఆంజనేయులు ఎంపిక





డాక్టర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2024 సంవత్సరానికిగానూ మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. సోమవారం నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అతడికి అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. వచ్చే నెల 5న తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 8వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ నేషనల్ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ హనుమాండ్లు ఉన్నారు. **–షాబాద్, ఆగస్టు 26**

### ఠాణాకు తరలిస్తుండగా..

## గుండెపోటుతో వ్యక్తి మృతి

ఆదిబట్ల, ఆగస్టు 26 : అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు తిరుగుతున్నారని స్థానికులు 100 నంబర్‌కు డయల్ చేశారు. అక్కడికెళ్లిన పోలీసులు వారిని ఠాణాను తీసుకొస్తుండగా.. అందులోని ఓ వ్యక్తికి చాతీలో నొప్పి వస్తున్నదని చెప్పడంతో దవాఖానకు తీసుకెళ్లగా గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం ఆదిబట్ల ఠాణా పరిధిలో జరిగింది. కుర్మల్‌గూడ గ్రామంలో ఓ రియల్ ఎస్టేట్‌కు చెందిన కంటైనర్ వద్దకు నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఫౌజి(45), గోవింద్, నరేశ్ ఆటోలో వెళ్లారు. ఆ ప్రాంతంలో ఆ ముగ్గురు కలిసి అనుమానాస్పదంగా తిరగడంతో స్థానికులకు అనుమానం వచ్చి 100 నంబర్‌కు డయల్ చేశారు. దీంతో ఆదిబట్ల పోలీసులు ఆ ముగ్గురు చోరీకోసం వచ్చారనే అనుమానంతో వారి ఆటోలోనే ఠాణాకు బయల్దేరారు. అయితే ఫౌజీ అనే వ్యక్తి చాతీలో నొప్పి వస్తున్నదని పోలీసులకు చెప్పడంతో వారు దగ్గరలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. అప్పటికే ఆ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

# బల్దియాలోనే ఉంటాం..

### బదిలీ చేసినా..సీటు వదలని డిప్యూటీ కమిషనర్లు

సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : బదిలీ చేసినా.. బల్దియాను వదలమంటున్నారు కొందరు డిప్యూటీ కమిషనర్లు. దాదాపు 20 రోజుల తర్వాత బదిలీపై బల్దియాకు వచ్చిన అధికారులకు ఎట్టకేలకు కమిషనర్ పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ఒకరిద్దరి పోస్టింగ్‌లపై నేటికీ సస్పెన్స్ కొనసాగుతున్నది. జూబ్లీహిల్స్ సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న అధికారి ఇతర చోటకు బదిలీ అయ్యారు. ఆ పోస్టు భర్తీ చేయలేదు. అయితే ఆ సర్కిల్ బాధ్యతలను ఇతరులను అప్పగించినట్లు ఈ నెల 21న జరిపిన 25 మంది అధికారుల అంతర్గత బదిలీల జాబితాలోనూ పేర్కొనలేదు. సదరు డిప్యూటీ కమిషనర్‌కు మేయర్ అండదండలు ఉన్నాయని, ఆమె ప్రమేయంతోనే జూబ్లీహిల్స్‌లోనే కొనసాగేలా.. ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ తిరిగి ఇక్కడే పోస్టింగ్ తెచ్చుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ డీసీ వ్యవహారం ఇలా ఉంటే.. సీడీఏ నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ అయిన శ్రీధర్‌ను అక్కడి నుంచి అధికారులు రిలీవ్ చేయడం లేదు. సిద్దిపేటకు బదిలీ అయిన మరో డిప్యూటీ కమిషనర్ తిరిగి జీహెచ్ఎంసీకి వచ్చేలా పైరవీ చేస్తున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది.

## రూ. 8.5 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

### బోయిన్‌పల్లిలో ముగ్గురి అరెస్టు

సిటీబ్యూరో: బోయిన్‌పల్లి పరిధిలో హెచ్‌న్యూ, స్థానిక పోలీసులు భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. రూ. 8.5 కోట్ల విలువైన ఎఫిటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. బౌరంపేట్‌కు చెందిన గోసుకొండ అంజిరెడ్డి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో చంద్రారెడ్డి పేరుతో ఫంక్షన్ హాల్, స్విమ్మింగ్ పూల్ నిర్వహించేవాడు. సాయికుమార్, రాకేశ్‌తో పరిచయమైంది. ఈ ఇద్దరితో కలిసి అల్ఫాజోలంను తయారు చేయాలని అంజిరెడ్డి ప్లాన్ చేశాడు. గ్రామంలో కొత్తపల్లి ప్రభాకర్‌గౌడ్ సహకారంతో కోళ్ల ఫారంలో గదిని అద్దెకు తీసుకొని.. రియాక్టర్‌ను ఏర్పాటు చేశాడు. బాలానగర్ నుంచి అంజిరెడ్డి ముడి సరుకులు తెచ్చి సాయిగౌడ్, రాకేశ్‌లకు ఇస్తే.. వారు అల్ఫాజోలం, ఎఫిటమైన్ మత్తుపదార్థాలను తయారు చేసి..మార్కెట్‌లో అమ్మడం చేసేవారు.జూన్ 18న కోళ్ల ఫారంపై పోలీసులు దాడి చేసి.. అంజిరెడ్డిని అరెస్ట్ చేసి 2.6 కిలోల అల్ఫాజోలంతో పాటు ముడిసరకును స్వాధీనం చేసుకున్నారు. టీజీనాబ్‌కు అంజిరెడ్డి చిక్కడానికి 10 రోజుల ముందే కోళ్ల ఫారంలో తయారు చేసిన 8.5 కిలోల ఎఫిటమైన్ డ్రగ్‌ను తన అనుచరుడైన గుమ్మిడిదలకు చెందిన కుంచల నాగరాజుకు అందించి.. దానిని భద్రపరుచాలని సూచించాడు.ఈ క్రమంలో నాగరాజు తన వద్ద డ్రగ్‌ను నగరానికి తీసుకెళ్లి అక్కడ అవసరమైన వారికి విక్రయించాలని ప్లాన్ చేశాడు. తన స్నేహితులు వినోద్‌కుమార్‌గౌడ్, శ్రీశైలంల సహకారం తీసుకున్నాడు. వాహనంలో బయలుదేరిన ఈ ముగ్గురిని విశ్వసనీయ సమాచారంతో హెచ్‌న్యూ బృందం బోయిన్‌పల్లిలో పట్టుకున్నది. 8.5 కిలోల ఎఫిటమైన్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. కాగా, సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి ముఠాను అరెస్టు చేసి.. 10 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నారు.

# నిల్చోడానికీ తిప్పలే..

### కిటకిటలాడుతున్న మెట్రో..అదనపు కోచ్‌ల ఊసెత్తని ఎల్అండ్‌టీ



సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంలో మెట్రో రైలు సేవలు ప్రారంభమై ఆరేండ్లు దాటింది. ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతి రోజూ 5లక్షలకు పైగా నగరవాసులు మెట్రోలో ప్రయాణిస్తున్నారు. 57 కోచ్‌లతో 69 కి.మీ మేర నడుస్తున్న మెట్రో రైళ్లలో కారిడార్–2 (జేబీఎస్–ఎంజీబీఎస్) మినహా మిగతా రెండు కారిడార్లలో రద్దీ అధికంగా ఉంటున్నది. కారిడార్–1(ఎల్బీనగర్–మియాపూర్), కారిడార్–3 ( నాగోల్–రాయదుర్గం)లో మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. కనీసం నిలబడేందుకూ చోటు ఉండటం లేదు. లోపలికి ఎక్కిన తర్వాత అటు ఇటు కదలడానికి కూడా అవకాశం లేనంతగా రద్దీ ఉంటున్నది. ఈ క్రమంలోనే కొన్ని నెలలుగా 3 కోచ్‌లు ఉన్న మెట్రో రైళ్ల బోగీలను ఆరుకు పెంచాలంటూ డిమాండ్ చేస్తున్నా ఎల్‌అండ్‌టీ పట్టించుకోవడం లేదు. ఏటా ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నదే తప్ప.. ఎక్కడా తగ్గడం లేదు. భవిష్యత్‌లోనూ మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అయినా అదనపు మెట్రో కోచ్‌ల విషయంలో ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అదనపు కోచ్‌ల విషయంలో ఇప్పటి వరకు ఒక్క అడుగు ముందుకు వేయలేదు. కొత్త కోచ్‌ల కోసం ఆర్డర్లు ఇచ్చినా.. కొన్ని నెలల సమయం పడుతుంది. గతంలో సౌత్ కొరియా నుంచి కోచ్‌లను తెప్పించగా, అదనపు బోగీల కోసం మళ్లీ అక్కడి నుంచే తెప్పించే ప్రయత్నాలు చేస్తున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. కాగా, రద్దీగా ఉన్న మెట్రో రైళ్లలోనే ఇరుక్కొని ప్రయాణం చేయాల్సి వస్తోందంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఫొటోలతో సహా తరచూ పోస్టులు చేస్తున్నారు. అయినా ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు అదనపు కోచ్‌లను తీసుకురావడంలో ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని వాపోతున్నారు.



సికింద్రాబాద్ ఇస్కాన్ టెంపుల్‌లో కృష్ణాష్టమి వేడుకలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

# నంద బాలం.. భజరే..

''నంద బాలం భజరే.. నంద బాలం.. బృందావన వాసుదేవ బృందలోలం'' అని శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలను నగరం యావత్తు సోమవారం అత్యంత ఉత్సాహంతో జరుపుకున్నారు. చిన్నా పెద్ద అంతా, ప్రధానంగా యువకులు శ్రీకృష్ణుని ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరం చుట్టూరా వెలసిన ఇస్కాన్ ఆలయాల్లో మాధవుడి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నగరంలో పలు యువజనులు ఉట్లు కొట్టారు. ఇంకా జారుడు స్తంభాన్ని పాకి పైనున్న బహుమతులను అందుకున్నారు. ఒక వర్గం వారే కాకుండా అన్ని సామాజిక వర్గాలు జన్మాష్టమిని ఒక ప్రధాన వేడుకగా జరుపుకున్నారు. నగరంలోని పలు వీధుల్లో ఈ ఉత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. పలువురు పడతులు కృష్ణుని పాదాలను తన ఇంటి నుంచి వస్తున్నట్టుగా ముగ్గులు వేసి ఆనందించారు.



అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్లో ఆకర్షణీయంగా బలరాముడు, సుభద్ర, శ్రీకృష్ణుడి అలంకరణ



బంజారాహిల్స్ హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో పచ్చదనం సంతరించుకున్న రాధాకృష్ణులు

# సస్పెన్షన్లు ఉండవ్.. తీసేసుడే!

### పంజాగుట్టలా ఆ ఠాణాలను ప్రక్షాళన చేస్తా

**నమస్తే ఎఫెక్ట్**

సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): 'ఎంత మందలించిన కొందరు సిబ్బందిలో మార్పు రావడం లేదు. పంజాగుట్ట ఠాణా మాదిరిగా మధురానగర్, బోరబండ పోలీస్‌స్టేషన్లనూ ప్రక్షాళన చేస్తా' అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆ రెండు ఠాణాల్లో జరగుతున్న అవినీతి, అక్రమాలపై సోమవారం 'ఖాకీ కాసుల కక్కుర్తి', 'వ్యభిచార గృహాలనూ వదలట్లే' అనే శీర్షికలతో 'నమస్తే తెలంగాణ'లో కథనాలు రావడంతో అవినీతి అధికారుల్లో అలజడి మొదలైంది. ఈ కథనాలపై విలేకర్లు సీపీని ప్రశ్నించడంతో ఆయన స్పందించారు. ఈ రెండు ఠాణాలు ఇలా ఎందుకు తయారవుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. మధురానగర్ ఠాణాలో స్పాట్ సెంటర్ (వ్యభిచార గృహం) నుంచి కానిస్టేబుళ్లు మామూళ్లు తీసుకుంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, దానిపై విచారణ కొనసాగుతున్నదన్నారు. ఇక నుంచి సస్పెన్షన్లు ఉండవని, ఉద్యోగంలో నుంచి తొలగించడమే ఉంటుందని సిబ్బందిని హెచ్చరించారు. బండ్లగూడ ఠాణాలో ఓ కానిస్టేబుల్ పాన్ డబ్బాలో నుంచి మామూళ్లు తీసుకుంటున్నట్లు ఫిర్యాదురావడంతో విచారణ జరిపి నిజమని తేలడంతో సస్పెండ్ చేశామని సీపీ వెల్లడించారు. అలాగే ఆ రెండు ఠాణాల్లో అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు ఉన్నాయని, తగిన చర్యలు తీసుకుంటానని, పంజాగుట్ట ఠాణా మాదిరిగానే వాటిని కూడా ప్రక్షాళన చేస్తామన్నారు. అవినీతి, అక్రమాలు చేసే వారిని సస్పెండ్ చేస్తే భయం ఉండటం లేదని, ఇక నుంచి ఉద్యోగం నుంచి తొలగించడమే ఉంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పనిచేయాలని సీపీ సిబ్బందిని హెచ్చరించారు.

